చిమ్మ చీకట్లు.. తాగునీటికి ఇక్కట్లు

- మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మె పర్యవసానం
- 32 రోజులుగా అమలాపురంలో నిరసన
- పట్టించుకోని ప్రభుత్వం
- వర్కర్ల సహాయ నిరాకరణతో లోపించిన నిర్వహణ



అమలాపురం భూపయ్య అగ్రహారంలో వీధి లైట్లు వెలగక అలముకున్న అంధకారం



అమలాపురం అశోక్‌నగర్‌లో కుళాయిల నుంచి వచ్చిన కలుషిత నీరు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 50 ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె బాట పట్టడంతో ఆ ప్రభావం ముఖ్యంగా తాగునీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణపై తీవ్రంగా పడింది. వీరి సమ్మెతో స్కిల్డ్ వర్కర్లు లేక ఆ రెండు విభాగాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. పలు ప్రాంతాల్లో రాత్రి అయితే చాలు వీధి లైట్లు వెలగక చిమ్మ చీకట్లు అలుముకుంటుంటే.. మరికొన్ని ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా అందక ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మెను రిలే దీక్షలతో మొదలు పెట్టి ఈనెల ఒకటో తేదీ నుంచి మరింత ఉధృతం చేశారు.

1వ తేదీ నుంచి విధుల బహిష్కరణ

32 రోజులుగా ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం వీరి న్యాయమైన కోర్కెలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టకపోవడంపై ఆ వర్కర్లు మరింత అసహనానికి గురవుతున్నారు. నెలాఖరు వరకూ మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టి నిరసన తెలిపారు. కొంతమంది విధులకు హాజరయ్యేవారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఆ వర్కర్లు విధులను పూర్తిగా బహిష్కరించి తాము పర్యవేక్షించే తాగునీరు, వీధి లైట్ల విభాగాలకు సహాయ నిరాకరణతో నిరసన గళం వినిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు సమ్మె బాట పట్టడంతో ప్రతి మున్సిపాలిటీలో ఇదే అసౌర్యం, సమస్య ఉత్పన్నమవుతోంది. ఎనిమిది రోజుల నుంచి అమలాపురం పట్టణ ప్రజలు వీరి సమ్మెతో తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. భూపయ్య అగ్రహారంలోని పలు వీధులతోపాటు కురసాల వీధి, చిక్కాల వారి వీధి, రవణంవీధి ఇలా పలు వీధుల్లో వీధి లైట్లు వెలగక రోజూ రాత్రి సమయాల్లో ప్రజలు అంధకారంతో అవస్థలు పడుతున్నారు. కొన్ని వార్డుల్లో కౌన్సిలర్లు వీధి లైట్లకు చెందిన విద్యుత్ బాక్సుల వద్దకు వెళ్లి వీధి దీపాల స్విచ్ ఆన్ చేస్తున్నారు.



అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ వర్కర్లు

తాగునీటి సరఫరాలో సమస్యలు

ఇంజినీరింగ్ వర్కర్లు ఎక్కువ మంది తాగునీటి విభాగంలోనే ఉంటారు. వీరంతా సమ్మెలో ఉండడంతో తాగునీటి సరఫరా నిర్వహణ లోపంతో పట్టణంలోని పలు వీధుల్లో నీరు సక్రమంగా అందడం లేదు. నిర్వహణ లోపంతో కొన్ని చోట్ల మురికి నీరు, మరికొన్ని చోట్ల అరకొరగా నీరు అందుతోంది. అశోక్ నగర్, ఏవీ నగర్, కార్మిక నగర్ ఇలా పలు కాలనీలు, వీధుల్లో తాగునీటి సమస్యలతో ప్రజలు

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి



న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 32 రోజులుగా నిరసనలు తెలుపుతున్నాం. ఈనెల ఒకటో తేదీ నుంచి ఇంజినీరింగ్ వర్కర్లంతా విధులు బహిష్కరించి సమ్మెను ఉధృతం చేశాం. పలువురు అధికారులు, కౌన్సిలర్ల నుంచి విధులపరంగా మాపై ఒత్తిడి ఉన్నా సమ్మెను పట్టువీడకుండా కొనసాగిస్తున్నాం. సమ్మె వల్ల కొన్ని సమస్యలున్నా పట్టణ ప్రజలు మాకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలపై సానుకూలంగా స్పందించాలి.

– దంగేటి షణ్ముఖరావు, అధ్యక్షుడు, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్, అమలాపురం

ఇబ్బంది పడుతున్నారు.

ఫలించని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

మున్సిపాలిటీలో పనిచేసే 50 మంది ఇంజినీరింగ్ వర్కర్లు విధులకు హాజరు కాకుండా సమ్మెలో ఉండడంతో మున్సిపల్ అధికారులు చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏ మాత్రం ఫలితాలు ఇవ్వడం లేదు. రెగ్యులర్ వర్కర్లు 8 మంది, వార్డు సచివాలయ ఇంజినీరింగ్ కార్యదర్శులు 8 మందితో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. 50 మంది ఇంజినీరింగ్ వర్కర్ల విధుల ముందు ఈ 16 మంది ప్రత్యామ్నాయంగా అందిస్తున్న సేవలు ఎంత మాత్రం సరిపోవడం లేదు. ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సరిపోవకపోవడం వల్లే పట్టణంలోని పలు ప్రాంతాలు వీధి లైట్లు వెలగక అంధకారంలో ఉంటున్నాయి. తాగునీరు చాలా ప్రాంతాలకు అరకొరగా అందుతోంది.

క్లుప్తంగా

నేడు షైనింగ్ స్టార్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్ పురస్కారాల ప్రదాన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్టు డీఈవో సలీమ్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో 2025 విద్యా సంవత్సరానికి జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హాజరవుతారని తెలిపారు.

వైభవంగా ధనమ్మ తీర్థం



విశేష అలంకరణలో ధనమ్మవారు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవులో మాధవరాయుని పేటలో కొలువైన గ్రామదేవత ధనమ్మ వారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్థ మహోత్సవంలో తాళ్లరేవు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ధనమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తీర్థ మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు కావ్య ఎంపిక



అమలాపురం టౌన్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు అమలాపురం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.కావ్య ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.విజయకుమారి తెలిపారు. కావ్య ఒక్క చదువులోనే కాకుండా క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లోనూ అనేక బహుమతులు గెలుచుకుంది. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో 118 మార్కులు సాధించి స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధించింది. ఏటా రూ.12 వేల వంతున నాలుగేళ్లకు గాను మొత్తం రూ.48 వేలు కావ్యకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా సహకారం అందుతుంది. కావ్య తండ్రి కవిగానే కాకుండా స్థానిక వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా పనిచేస్తారు.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా వ్యవస్థ

అమలాపురం టౌన్: నెల రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమ్మెతో అమలాపురం పట్టణంలో తాగునీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ఇన్‌ఛార్జి పాలమూరి మోహన్ బాబు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిల నుంచి మురికి నీరు, రంగు మారిన నీరు వస్తున్నా ప్రజారోగ్యం పట్ల పట్టణ కూటమి నేతలు శ్రద్ధ వహించి చర్యలు తీసుకునేలా అధికారులపై ఒత్తిడి తేవడంలో విఫలమవుతున్నారని ఆరోపించారు. మంచి నీటి చెరువుల్లో నీటిని మున్సిపాలిటీ సిబ్బంది శాస్త్రీయంగా శుద్ధి చేయకుండా నేరుగా పైపులైన్ల ద్వారా కుళాయిల ద్వారా సరఫరా చేయడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని మున్సిపాలిటీ అధికారులను మోహన్‌బాబు డిమాండ్ చేశారు.

సబ్ సెంటర్‌లో అరకొరగా వైద్య సేవలు



కనకాలపేట ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

యానాం: నియోజకవర్గ పరిధిలో కనకాలపేట గ్రామ ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రంలో కనీసం టీటీ ఇంజక్షన్ స్టాకు ఉంచడం లేదని అడుగుతుంటే యానాం జీహెచ్‌కు వెళ్లాలని సిబ్బంది సమాధానం చెబుతున్నారని ఆదివారం గ్రామస్తులు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీవారం సబ్ సెంటర్‌కు వచ్చే సాధారణ వైద్యుడు సైతం కొన్ని నెలలుగా రావడం లేదని దీంతో రోగులకు వైద్యం అందించేవారు కరువయ్యారని అన్నారు. అదేవిధంగా గైనకాలజిస్ట్ ఆస్పత్రికి రాకపోవడంతో గర్భిణులకు వైద్య సేవలు అందడం లేదన్నారు. మందులు నిల్వ ఉంచడానికి ఫ్రిజ్ సైతం సబ్‌సెంటర్‌లో లేదని పదివేల మంది జనాభా ఉన్న గ్రామానికి వైద్యసౌకర్యం కరువయ్యిందని వారు అన్నారు. సమస్యను పరిష్కరించాలని స్థానిక యువజన నాయకుడు కోన సత్తియ్య డిమాండ్ చేశారు.

బస్టాండ్‌లో సీలింగ్ ఫ్యాన్ల ఏర్పాటు

అమలాపురం రూరల్: ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తక్కువ విద్యుత్ వినియోగించే బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ అందించింది. సామాజిక బాధ్యతలో భాగంగా మొదటి విడతగా పంపిణీ చేసిన 28 సీలింగ్ ఫ్యాన్లను అమలాపురం బస్ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం బిగించినట్టు డీఎం చల్లా సత్యనారాయయణమూర్తి ఆదివారం తెలిపారు. వీటి వల్ల ప్రయాణికులకు సౌకర్యంతో పాటు, విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు.

పంచాయతీ చెరువులో చేపల మృత్యువాత



చల్లపల్లి పంచాయతీ ప్రాజెక్ట్‌లో చనిపోయిన చేపలను చూపుతూ నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీ పరిధి రావి చెట్టు సెంటర్లో ఉన్న తాగునీటి ప్రాజెక్ట్ చెరువులో ఆదివారం చేపలు మృత్యువాత పడ్డాయంటూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మూడు రోజుల క్రితం గ్రామంలో పంచాయతీ కుళాయిల నుంచి కలుషిత నీరు వస్తోందని మురుగునీటి బాటిళ్లతో గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఆ సమయంలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ప్రాజెక్ట్‌ను పరిశీలించి గ్రామస్తులకు ప్రత్యామ్నాయంగా మండల ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు తమ నిరసనను విరమించారు. అధికారులు ఫిల్టర్ బెడ్‌లను మరమ్మతులు చేసి నీరు అందించే క్రమంలో మరలా చెరువులో చేపలు మృత్యువాత పడటం ఏమిటని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రాజెక్ట్‌లో చనిపోయిన చేపలను చూపుతూ నిరసన చేపట్టారు. అక్టోబరు 2న నిర్వహించిన గ్రామ సభలో మురుగునీరు శుద్ధి కాకుండా కుళాయిల ద్వారా నేరుగా రావడంతో పంచాయతీరాజ్ కమిషనర్‌కు చేరే విధంగా పంచాయతీలో ఫిర్యాదు చేసిన సిబ్బంది సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని పలువురు అన్నారు. కలుషిత నీటితో గ్రామ ప్రజలు ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్‌ను వివరణ కోరగా ఫిల్టర్ బెడ్‌లు మరమ్మతులు చేసి, రెండు రోజులుగా పంచాయతీ, సీడబ్ల్యూపీసీ స్కీముల నుంచి తాగునీరును అందించామని, చేపలు చనిపోవడంతో పంచాయతీ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేసి సీడబ్ల్యూపీసీ స్కీము నుంచి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు.

తాగునీటి సమస్యపై మహిళల నిరసన



చినబాపనపల్లిలో ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాళ్లరేవు: మండల పరిధిలో పోలేకుర్రు పంచాయతీ చినబాపనపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం స్థానిక వాటర్ ట్యాంకు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజులుగా పైపులైన్ల ద్వారా సరఫరా చేసే తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని పంచాయతీ అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు సైతం మొర పెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. అప్పుడప్పుడు వచ్చే తాగునీరు సైతం దుర్వాసనతో పచ్చగా ఉంటోందని దీంతో ఆ నీటిని తాగలేకపోతున్నామన్నారు. స్థానిక రక్షిత మంచినీటి పథకం ట్యాంకు వద్ద పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉందన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడంతో నీరు అపరిశుభ్రంగా ఉంటోందన్నారు. సమస్యను పరిష్కరించకపోతే ఎంఆర్‌ఓ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా జీతాలు, పెన్షన్లు లేవు

- కుక్కలకు వేసక్టమీ ఆపరేషన్లకు రూ.లక్షల్లో బిల్లులు
- మున్సిపల్ ఉద్యోగుల ఆవేదన



యానాంలో వేసక్టమీ ఆపరేషన్లకు కుక్కలను ప్రత్యేక వాహనంలో తరలింపు (ఫైల్)

యానాం: ఆరు నెలల నుంచి జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు మంజూరుకాక ఇబ్బందులు పడుతుంటే పట్టణంలో కుక్కలకు వేసక్టమీ ఆపరేషన్లు చేయడానికి రూ.లక్షల్లో బిల్లులు చేస్తుండటం ఆవేదన కలిగిస్తోందని ఆదివారం పలువురు మున్సిపల్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ నెల వరకు తమకు జీతాలు లేవని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీనికి తోడు విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు రాకపోవడంతో మందులు కొనుగోలుకు సైతం ఇతరులను అడిగే పరిస్థితి వచ్చిందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 55 మంది పెన్షన్‌దారులు ఉండగా మరో 50 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పింఛనుదారులకు 7వ వేతన సంఘ సిఫార్సులను అమలు చేయాలని 2023లోనే దానికి సంబంధించి జీఓ వచ్చినప్పటికీ ఇప్పటి వరకు వాటికి సంబంధించి బిల్లులు చేయడం లేదన్నారు. మున్సిపాలిటీ అకౌంట్‌లో సుమారు రూ.12లక్షల వరకు ఉందని, ఆ సొమ్ముతో తమకు జీతాలు, పింఛన్లు ఇవ్వడం మానేసి కుక్కలకు సంతానం కలుగకుండా ఫిబ్రవరిలో ఏబీసీ ఆపరేషన్లు నిర్వహించారంటూ కాకినాడకు చెందిన సొసైటీ ఫర్ నేచర్ అండ్ యానిమల్స్ సంస్థకు రూ.6 లక్షలు వరకు ఖర్చు అయ్యిందని మొదటి విడతగా రూ.2లక్షలు బిల్లులు చెల్లించడానికి నిర్ణయించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. ఒక్కొక్క ఆపరేషన్‌కు రూ.2,005 ఖర్చు అవుతుందని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ వివరణ

కుక్కలకు వేసక్టమీ ఆపరేషన్లు బిల్లులపై మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ వివరణ కోరగా ఇప్పటి వరకు పట్టణంలో శునకాలు పెరిగిపోయాయని, దీంతో 250 కుక్కలకు ఆపరేషన్లు నిర్వహించారని దానికి సంబంధించి బిల్లులు చెల్లించాల్సిన బాధ్యత తాను తీసుకున్నానన్నారు. చెల్లించకపోతే తాను ఇబ్బందులు పడతానన్నారు. మున్సిపల్ ఉద్యోగులకు నెలకు రూ.48 లక్షలు జీతాలకు మంజూరు కావాల్సి ఉందన్నారు.

కలెక్టర్ తనయుడికి అంతర్వేదిలో అక్షరాభ్యాసం



అంతర్వేది ఆలయంలో కుమారుడికి అక్షరాభ్యాసం చేయిస్తున్న కలెక్టర్ దంపతులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామివారి ఆలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ ఆయన కుమారుడికి అక్షరాభ్యాసం చేయించారు. తొలుత స్వామివారి దర్శనానికి వచ్చిన కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి సన్నిధిలో కుటుంబ సమేతంగా కలెక్టర్ కుమారుడికి అక్షరాభ్యాసం చేశారు. కలెక్టర్‌కు స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఏసీ సత్యనారాయణ అందజేశారు. కాగా స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పర్యవేక్షణలో వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి అక్షరాభ్యాసానికి సంబంధించి పూజలు చేశారు. అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికీ యోగా దినచర్య కావాలి



యోగాసనాలు వేస్తున్న జేసీ నిషాంతి, ఎమ్మెల్యే ఆనందరావు, ఆర్డీవో మాధవి తదితరులు

అమలాపురం టౌన్: నిత్య జీవితంలో ప్రతి వ్యక్తికీ యోగా దినచర్య అయినప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) టి.నిషాంతి పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణావు పార్కులో ఆదివారం ఉదయం నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో జేసీ నిషాంతి పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆర్డీవో కొత్తపల్లి మాధవి, మున్సిపల్ కమిషనర్ బి.రాణి సంయుక్త, కలెక్టరేట్ ఈవో కె.కాశీ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ తదితరులు యోగా శిక్షణలో పాల్గొని గురువుల సమక్షంలో ఆసనాలు వేశారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, విశ్రాంత పీఈటీ పప్పుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడలో రాణిస్తున్న యానాం యువకుడు

- ప్రైమ్ వాలీబాల్ టోర్నీ వేలం
- రూ.3 లక్షలకు విష్ణువర్ధన్‌ను దక్కించుకున్న చెన్నై బ్లిట్జ్ జట్టు



చెన్నై బ్లిట్జ్ యూనివర్సల్ జట్టుకు ఎంపికైన విష్ణువర్ధన్

యానాం: వాలీబాల్ క్రీడలో యానాంకు చెందిన యువకుడు రాణిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన ప్రైమ్ వాలీబాల్ టోర్నీలో యానాం సీతమ్మపేటకు చెందిన క్రీడాకారుడు కైలా విష్ణువర్ధన్‌ను చెన్నై బ్లిట్జ్ యూనివర్సల్ ఫ్రాంచైజీ జట్టు వేలంలో రూ.3 లక్షలకు దక్కించుకుంది. ఆదివారం చెన్నైలో నిర్వహించిన వేలంలో వివిధ జట్లు క్రీడాకారులును కొనుగోలు చేశాయి. ఈ నేపథ్యంలో తనను వేలంలో చెన్నై బ్లిట్జ్ యూనివర్సల్ జట్టు తీసుకుందని విష్ణువర్ధన్ చెన్నై నుంచి విలేకరులకు తెలిపారు. విష్ణువర్ధన్ వాలీబాల్ క్రీడలో నైపుణ్యం ప్రదర్శిస్తుండటంతో స్థానిక యానాంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) క్రీడా హాస్టల్‌లో ఇంటర్ చదివారు. ప్రస్తుతం ఆయన చెన్నైలో లయోలా కాలేజీలో డిగ్రీ చదువుతూ ఇండియన్ బ్యాంక్ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నారని తెలిపారు. చెన్నై బ్లిట్జ్‌తో పాటు అహ్మదాబాద్, బెంగుళూరు, కాలికట్, ఢిల్లీ, కొచ్చి, కోల్‌కతా తదితర జట్లు పోటీపడ్డాయి. తండ్రి కైలా ఏసుబాబు మృతిచెందగా తల్లి శశిరేఖ విష్ణువర్ధన్ క్రీడాభిరుచిని గుర్తించి ప్రోత్సహిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. విష్ణువర్ధన్ ఎంపికపై పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆయనకు ఫోన్‌చేసి అభినందించారు.

ప్రశాంతంగా విద్యుత్ జేఈఈ రాత పరీక్ష

యానాం: పుదుచ్చేరి విద్యుత్ శాఖలో 73 జూనియర్ ఇంజనీరు పోస్టుల భర్తీకి ఈనెల 8న ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పుదుచ్చేరి వ్యాప్తంగా 6 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన రాత పరీక్షకు 1,904 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 1,415 మంది (74.32శాతం) పరీక్షకు హాజరయ్యారని, మిగిలిన 489 మంది (25.68శాతం) మంది పరీక్షకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అనంతరం పరీక్షకు సంబంధించి ఏ,బీ,సీ,డీ సిరీస్‌లో పేపర్–1,2కు సంబంధించిన కీ పరీక్ష నిర్వహించిన డీపీ అండ్ ఏఆర్ శాఖ కార్యదర్శి జయశంకర్ విడుదల చేసారు. అభ్యర్థులు ఈనెల 9లోగా జవాబులకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలుంటే రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ఐ పోలవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటారని ఆదివారం హెచ్‌ఎం కె వెంకటలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉందుర్తి అఖిల్‌భాస్కర్, గంగుల శివ చరణ్, పెచ్చెట్టి సాయిరాం, బిరుదు కోటదిలీప్, అమలాపురపు శ్రీనివాస్, దైవాల అమృతవర్షిని, కర్రి వీరలక్ష్మీ, అమలాపురపు భవన రాజశ్రీ, కేడీఎల్ కీర్తన, ఇళ్ల పవిత్ర, వి సూర్యదీక్షిత, కె తేజస్విని, దైవాల ప్రసన్నదుర్గభవాని స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, బయాలజీ టీచర్ లంకే హేమశ్రీనివాసరావును ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎస్ఎంసీ చైర్మన్ విత్తనాల సత్యమూర్తి, సర్పంచ్ కాలే రాజబాబు అభినందించారు.

పీఎంఎంఎస్‌వై ద్వారా వాహనం అందజేత



వాహనాన్ని లబ్ధిదారుడికి అందజేసిన ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం (పీఎంఎంఎస్) ద్వారా మంజూరైన వాహనాన్ని శనివారం లబ్ధిదారుడు సబ్బితి సుందర ఆనందకుమార్‌కు ఆర్‌ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షలు విలువచేసే బొలెరో మాక్స్ హెచ్‌డీ 1.7 లీటర్ల సామర్థ్యం గల వాహనం కొనుగోలుకు మంజూరయ్యిందని దానిలో 40 శాతం సబ్సిడీ ఉందని తెలిపారు. మత్స్యశాఖ ద్వారా వివిధ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఏఈ గొంతియ్య పాల్గొన్నారు.

ఘనంగా నందీశ్వరుడికి అభిషేకం



నందీశ్వరునికి విశేష పూజలు

తాళ్లరేవు: మండల పరిధిలో సుంకరపాలెంలో కొలువైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం త్రయోదశిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు శ్రీ కంఠం గిరిబాబుశర్మ పర్యవేక్షణలో వేదమంత్రోచ్చారణ నడుమ నందీశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రతి త్రయోదశి రోజున దాతల సహకారంతో నందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

యానాం: పుదుచ్చేరి జిప్‌మెర్ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిపై మెడికల్ ఆఫీసర్ పోస్టులకు వచ్చే నెల 4న ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఆదివారం డైరెక్టర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పెషలిస్ట్ గ్రేడ్–2 (జూనియర్ స్కేల్) అనస్థీషియాలజీ–2, కార్డియాలజీ–1, మెడిసిన్–1, నెఫ్రాలజీ–1, ఓబీఎస్ అండ్ గైనిక్–1, రేడియో డయోగ్నసిస్–1, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్–10 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. స్పెషలిస్ట్‌లకు నెలకు రూ.1.24 లక్షలు, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లకు రూ.1.03 లక్షల వేతనం చెల్లిస్తున్నట్లు తెలిపారు. యానాం జిప్‌మెర్ కాన్ఫరెన్స్‌హాలులో ఉదయం 8 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జిప్‌మెర్ పుదుచ్చేరి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పంపించాలని సూచించారు.

నేడు జిల్లా స్థాయిలో యోగాసనాలపై శిక్షణ

అమలాపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7 గంటలకు ద్రాక్షారామ ఆలయ ప్రాంగణంలో యోగాపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా ప్రజల్లో ఆరోగ్యపరమైన చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా, యోగా ప్రాముఖ్యతను విశదపరిచే దిశగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, యువత, మహిళా సంఘాల సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ యోగా సంస్థల ప్రతినిధులు, వలంటీర్లు ఈ కార్యక్రమం పాల్గొననున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని శరీరం, మనస్సు, ఆత్మను సమన్వయపరచే జీవనశైలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

66 బీరు సీసాల స్వాధీనం



పట్టుబడిన బీరు సీసాలు

ఐ.పోలవరం: పుదిచ్చేరి యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టుగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. యానాం నుంచి ఎదుర్లంక మీదుగా కారులో 66 బీరు సీసాలను తరలిస్తున్నారు. ఎదుర్లంక వద్ద ఉన్న చెక్ పోస్టు వద్ద తనిఖీలో బీరు సీసాలు దొరికాయి. కారుతోపాటు బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: ముక్కామల ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రావులపాలెం నుంచి ముక్కామల వైపు వస్తున్న ఆటోను ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళుతున్న మోటారు సైకిల్ ఢీకొన్నాయి. దాంతో మోటారు సైకిలిస్టుకు తీవ్ర గాయాలు కాగా అమలాపురం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అంబాజీపేట పోలీసులకు సమాచారం అందించినట్లు స్థానికులు తెలిపారు.